క్లుప్తంగా

నేడు ధ్యాన శిక్షణ

ప్రకాశం నగర్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని గెయిల్ ఆఫీస్ పక్కనే కల పరమహంస యోగానంద యోగదా సత్సంగ్ ధ్యాన కేంద్రంలో మహావతార్ బాబాజీ ధ్యాన శిక్షణ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు ఎన్.శ్రీరామ్ కుమార్, జె.కుమార్ బాబు తెలిపారు. బాబాజీ బోధించిన క్రియా యోగాన్ని నేర్చుకోవడానికి ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిన్నారికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడియం: కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న మండా రమ్యశ్రీ అనే చిన్నారికి ఎస్టీయూ నాయకుడు దాసరి శివ ఆధ్వర్యంలో రూ.11 వేలు అందజేశారు. గ్రామ ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్ చేతుల మీదుగా ఈ సాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా వైద్య, ఆరోగ్య బృందం తనిఖీలు


పొట్టిలంకలో సేవలను పరిశీలిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ తనిఖీ బృందం

కడియం: మండలంలోని పొట్టిలంక సచివాలయం 1 పరిధిలో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలను జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ తనిఖీ బృందం శనివారం పరిశీలించింది. నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ సంధ్యారాణి, డీజీహెచ్ఎన్ వసంతలక్ష్మి, ఎంఎస్ఐ రామకృష్ణతో కూడిన ఈ బృందం హెచ్ఎంఐఎస్, ఆర్సీహెచ్, రక్తహీనత గల కిశోర బాలికలు, గర్భవతులకు అందిస్తున్న సేవలు, స్కూలు, స్కూలు వెలుపల ఉన్న పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సంబంధిత సేవలు అందుకున్న వారితో మాట్లాడారు. ఆయా కార్యక్రమాలకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కడియం ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి ఎన్.జెస్సీ సుప్రియ, ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

29న పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి సమావేశం


పీడీఎస్‌యూ సమావేశం పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

కంబాలచెరువు: విజయవాడలో ఈ నెల 29న నిర్వహించే పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక మావోభవన్ కార్యాలయంలో శనివారం పోస్టర్ విడుదల చేశారు. ఆయన 1974లో ఏర్పడిన పీడీఎస్‌యూ స్వేచ్ఛ, సమానత్వం కోసం, శాస్త్రీయ విద్యాసాధన, నూతన ప్రజాస్వామిక వ్యవస్థ నిర్మాణం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు, ప్రజలు, ప్రజాస్వామికవాదులు తమ వంతు సహకారం అందించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కె.భానుప్రసాద్, నాయకులు దినేష్, మావోరెడ్డి, సాయికుమార్, అహ్మద్, వంశీ పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

కంబాలచెరువు: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) డైరీని శనివారం రాజమహేంద్రవరం రీజియన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీవీ ఎన్‌టీ నారాయణ ఆవిష్కరించారు. రాజమహేంద్రవరం రీజియన్‌లో విద్యార్థులు మంచి విద్యా ప్రగతి సాధించాలని, అందుకు ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర శాఖ అధ్యక్షుడు జీవీవీ అప్పారావు, ప్రధాన కార్యదర్శి జేవీవీ సుబ్బారావు, జిల్లా కార్యదర్శి ఎస్.రవిబాబు, సహాధ్యక్షుడు ఎం.నరేష్, కోశాధికారి ఎస్.తేజ విజయ్ కుమార్, ఎస్‌వీ రాజగోపాల్ పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలి

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కళాశాలలో కొన్నేళ్లుగా రెగ్యులర్ అధ్యాపక పోస్టులను భర్తీ చేయట్లేదని, దీంతో అతిథి అధ్యాపకులపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య దూరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలో 36 రెగ్యులర్ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే కొత్త గ్రూపులు కూడా వచ్చాయని, డిగ్రీలో వచ్చిన హానర్స్ విధానంతో ఒక మేజర్ రెండు మైనర్ సబ్జెక్టులకు 4 సంవత్సరాల డిగ్రీ విధానాన్ని, ఇంటర్న్‌షిప్ లాంటి కొత్త కొత్త విధానాలు తీసుకురావటంతో విద్యార్థులు ఎక్కువ సమయంతో పాటు అదనపు ఖర్చు పెట్టాల్సి వస్తుందన్నారు.

పెట్రోల్ బంక్‌లలో ఈ సేవలన్నీ ఉచితమే..

- మరుగుదొడ్లు, తాగునీటి వసతి తప్పనిసరి
- ఉచితంగా వాహనానికి గాలి నింపాలి
- జిల్లాలో 183 పెట్రోల్ బంక్‌లు




పెట్రోల్ బంక్‌లో వాహనానికి గాలి నింపుతున్న సిబ్బంది

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మనం సాధారణంగా పెట్రోల్ బంకులకు వెళ్లి వాహనానికి పెట్రోలు కొట్టించుకుని వెళ్లిపోతూ ఉంటాం. అక్కడ కేవలం పెట్రోల్ మాత్రమే దొరుకుతుందని భావిస్తాం. అయితే అక్కడ మరిన్ని సేవలు పొందే అవకాశమూ ఉంది. అవి కూడా నిబంధనల మేరకు మనకు అందించాలి. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు సెంచరీ దాటేశాయి. వీటి ధరలు పెరిగినప్పుడల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులపై ప్రజలలో చర్చ జరుగుతుంది. ప్రతి లీటర్‌కు వ్యాట్ రూపంలో చెల్లిస్తున్న రుసుముతో వినియోగదారులకు బంక్‌లలో యజమానులు సౌకర్యాలు కల్పించాలి. వీటి గురించి చాలామందికి తెలియదు. ఒకరిద్దరు నిబంధనల గురించి ప్రశ్నిస్తే నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలోని చాలా పెట్రోల్ బంక్‌లలో సేవలు కానరావడం లేదు. కొన్ని చోట్ల టాయిలెట్లకు తాళాలు వేసి ఉంటున్నాయి. మరికొన్ని చోట్ల గాలి యంత్రాలు పనిచేయడం లేదు.

నిబంధనల ప్రకారం అందించాల్సిన సేవలు

స్వచ్ఛమైన తాగునీరు

జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన సుమారు 183 పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. వీటి వద్ద స్వచ్ఛమైన తాగునీటి వసతి కల్పించాలి. అక్కడ ఆర్వో యంత్రం, వాటర్ కనెక్షన్ ఏర్పాటు చేయాలి. ఏ బంకులోనైనా తాగునీటి వసతి లేకపోతే చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయవచ్చు.

మరుగుదొడ్లు

స్వచ్ఛ భారత్‌లో భాగంగా అన్ని బంక్‌లలో వాహన చోదకులు, ప్రజలకు మూత్రశాలలు, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటిని పలుచోట్ల ఏర్పాటు చేసినా వినియోగదారులను అనుమతించడం లేదనే విమర్శలు కూడా ఉన్నాయి. మరిన్ని చోట్ల అసలు మరుగుదొడ్డే కనిపించని పరిస్థితి. బంకుల్లో ఇలాంటి సౌకర్యాలు లేకపోతే పెట్రోలియం సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు. లీటర్ పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేసినందుకు మనం చెల్లించిన సొమ్ములో నాలుగు నుంచి ఎనిమిది పైసలు వరకూ మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణకు ఇస్తున్నాం.

ఫోన్ సదుపాయం

అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ వినియోగించుకునే సదుపాయం బంక్‌లలో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యల్లో చిక్కుకుంటే, మీ వద్ద మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పనిలేదు. ఏదైనా పెట్రోల్ బంక్‌ను సందర్శించడం ద్వారా మీరు ఏ నంబర్‌కైనా కాల్ చేసుకోవచ్చు.

నాణ్యతా ప్రమాణాలు

పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలను తెలుసుకునే హక్కు వినియోగదారులందరికీ ఉంది. దీనికి సంబంధించిన సదుపాయాన్ని బంక్‌ల యాజమాన్యాలు కల్పించాలి. పెట్రోల్, డీజిల్ తక్కువగా వచ్చిందని అనుమానం వస్తే వినియోగదారులు అక్కడిక్కడే పరీక్షించుకోవచ్చు. అందుకోసం క్వాలిటీ చెక్ టిష్యూ పేపర్‌ను అందుబాటులో ఉంచాలి. నోటీసు బోర్డులో సంబంధిత ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ నంబర్‌ని ప్రదర్శించాలి.

ఉచితంగా గాలి

వాహనాల టైర్లలో గాలి నింపడానికి, గాలి శాతం తనిఖీ చేసుకోవడానికి అనువుగా బంకుల్లో కచ్చితంగా యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఒక వ్యక్తిని నియమించాలి. బంకుల్లో పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేయకున్నా, వాహనదారుల కోరితే టైర్లలో గాలి తనిఖీ చేయాలి. ఇటీవల వాహనాల టైర్లలో సాధారణ గాలికి, ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు. ట్యూబ్‌లెస్ టైర్లు వస్తున్నాయి. వాటిల్లో నైట్రోజన్ నింపాలి.

ప్రథమ చికిత్స కిట్

ప్రతి బంక్‌లో ఫిర్యాదు బాక్స్, రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారుల తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ప్రథమ చికిత్స కిట్ ప్రతి బంక్ వద్ద ఉండాలి. ప్రజలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకునే వీలుంటుంది. ఆ ప్రథమ చికిత్స పెట్టెలో మందులు తప్పకుండా ఉండాలి.

నిబంధనలు పాటించాలి

"జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన 183 పెట్రోల్ బంక్‌లు ఉన్నాయి. నిబంధనలకు అనుగుణంగా మరుగుదొడ్లు ఉండాలి. తాగునీటి సదుపాయం కల్పించాలి. వాహనాలకు ఉచితంగా గాలి నింపాలి. పౌర సరఫరాలు, రెవెన్యూ, పోలీసు అధికారులు నిత్యం బంకుల్లో తనిఖీలు నిర్వహిస్తారు. ప్రత్యేకించి ఫిర్యాదులు వస్తే సత్వరం స్పందిస్తాం."

– పి.విజయ భాస్కర్, జిల్లా పౌరసరఫరాల అధికారి, తూర్పుగోదావరి జిల్లా

అవగాహన లేక..



"బంక్‌లలో సౌకర్యాలను వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. పెట్రోలియం మంత్రిత్వ శాఖ అధికారులు దీని కోసం సదస్సులు నిర్వహించాలి. సేవలన్నింటికీ కలిపి చమురు ధరలో వినియోగదారులు చెల్లిస్తున్నారు. వాస్తవానికి అవి అందుబాటులో ఉండటం లేదు. దీనికి కారణం ప్రజలకు సరైన అవగాహన లేకపోవడమే."

– చీర్ల సీతారామానాయుడు, రాజమహేంద్రవరం

పరిశుభ్రమైన నీటిని ప్రజలకు అందించాలి


వాటర్స్ వర్క్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగర ప్రజలకు పరిశుభ్రమైన నీటిని అందించాలని నీటి సరఫరా విభాగం అధికారులను కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో డయేరియా కేసులు వెలుగుచూస్తున్న తరుణంలో శనివారం ఆయన నగరంలోని నీటి సరఫరా కేంద్రాలు, రిజర్వాయర్లను తనిఖీ చేశారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలోని రిజర్వాయర్లను వెంటనే శుభ్రం చేయాలని, నిబంధనల ప్రకారం తదుపరి శుభ్రం చేయాల్సిన తేదీని అక్కడ ప్రదర్శించాలన్నారు. హెడ్ వాటరు వర్క్స్‌లో క్లారిఫైయర్స్ ఫిల్టర్ హౌస్‌లను పరిశీలించారు. గోదావరి నీటి సేకరణకు ఏర్పాటు చేసిన ఇన్ టేక్ వెల్స్ కూడా శుభ్రం చేసి పెయింట్ వేయాలన్నారు. నెలాఖరులోగా అన్ని కేంద్రాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. నగరంలో కొన్ని ఇంటి కుళాయి కనెక్షన్లు కాలువలలో ఉన్నాయని, వాటిని వెంటనే బయటకు పెట్టుకోవాలని ఆదేశించామన్నారు. నీటి పరీక్షల కోసం హెడ్ వాటర్ వర్క్స్‌లో అధునాతన ల్యాబ్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మదర్‌షా ఆలీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ పార్కుల్లో సకల సౌకర్యాలు


గాంధీ పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ పార్కులలో సౌకర్యాలను మెరుగుపరిచి, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. దానవాయిపేటలోని గాంధీ పార్కు, లాలాచెరువు జంక్షన్ వద్దగల చిల్డ్రన్స్ పార్కు, క్వారీ జంక్షన్ వద్ద ఏర్పాటు చేస్తున్న అంబేడ్కర్ విగ్రహం అభివృద్ధి పనులను శనివారం ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా నగరంలోని పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, పిల్లలు ఆడుకోవడానికి పరికరాలు, పెద్దలు ఆరోగ్యానికి వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే అభివృద్ధి చేసిన పార్కులను ప్రజలు ఉపయోగించుకుంటున్నారన్నారు. ఇతర పార్కులను అభివృద్ధి చేయటం జరుగుతోందన్నారు. వర్షాకాలంలో కంబాలచెరువు పార్కుకు వచ్చే సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని కాంట్రాక్టర్లను, సంబంధిత అధికారులను ఆదేశించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రాజమహేంద్రవరం రూరల్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) రాజమహేంద్రవరం సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పులి హనుశ్రీ సూచించారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం బొమ్మూరులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ మాట్లాడుతూ నార్కోటిక్ డ్రగ్స్ అనగా గంజాయి, నల్లమందు, బ్రౌన్ షుగర్, సింథటిక్ డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల ప్రభావంతో యువత మత్తుకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. డ్రగ్స్ అలవాటు అత్యంత ప్రమాదకరమన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వారి మెదడు మొద్దుబారి, విచక్షణ కోల్పోతారని చెప్పారు. మాదక ద్రవ్యాల వైపు యువత ఆకర్షితులు కావొద్దని, జీవితంలో లక్ష్యం ఏర్పర్చుకుని దాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. మత్తు, మాదక ద్రవ్యాల సమాచారాన్ని 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని కోరారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు, కళాశాల జనరల్ హెడ్ మురళీకృష్ణ, సెబ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు బి.శ్రీనివాస్, వై.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రియదర్శిని ఆశ్రమానికి వితరణ


టీవీ, పుస్తకాలను అందజేస్తున్న ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ ఉద్యోగులు

కంబాలచెరువు: మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని ఆశ్రమానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్ ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సాయం అందజేశారు. ఆ సర్కిల్ రీజినల్ మేనేజర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ తరఫున ప్రియదర్శిని ఆశ్రమంలోని 150 మంది పైగా చిన్నారులకు తమవంతు సహాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. తారక్ నాథ్ 20వ వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారులకు పుస్తకాల పంపిణీ, అన్నదానం చేశామన్నారు. అలాగే టెలివిజన్ అందించినట్టు తెలిపారు. ఆశ్రమంలో చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పి, ఆశ్రయం కల్పిస్తున్న కరస్పాండెంట్ కె.స్వప్న వర్మను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఆశ్రమానికి ఏ సహాయం అవసరమైనా దాన్ని చేయడానికి ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి మాడ్యుల్ స్టాఫ్ యూనియన్ నాయకులు బి.పాపారావు, కె.శ్రీనివాసరావు, జేఎస్ చంద్రశేఖర్, స్టాఫ్ అసోసియేషన్ నాయకులు శేషు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

1, 2 తరగతులకు విద్యాప్రవేశ్ కార్యక్రమం


పాఠశాలను పరిశీలిస్తున్న అర్బన్ రేంజ్ డీఐ దిలీప్ కుమార్

కంబాలచెరువు: నూతన విద్యా సంవత్సరంలో 1, 2 తరగతుల విద్యార్థులకు 90 రోజుల విద్యా ప్రవేశ్ ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించినట్టు అర్బన్ రేంజ్ డీఐబీ దిలీప్ కుమార్ తెలిపారు. స్థానిక సప్పా వారి మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యా ప్రవేశ్ 90 రోజుల ప్రణాళిక 1, 2 తరగతుల ఉపాధ్యాయుల వద్ద విధిగా ఉండాలన్నారు. ఏ రోజు చేసిన కృత్యాలు ఆ రోజు ఒక రిజిస్టర్‌లో రికార్డ్ చేయాలని, డైరీలో కూడా నమోదు చేయాలన్నారు. ఈ అంశంపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. యూడైస్ పోర్టల్‌లో నూతన విద్యార్థులను చేర్చుకునేందుకు టెక్నికల్ సమస్యలు తొలగించారన్నారు. త్వరగా ప్రోగ్రెషన్ మాడ్యూల్ పూర్తి చేసి కొత్త విద్యార్థులను వెబ్‌సైట్‌లోకి అప్లోడ్ చేయాలన్నారు. సప్పావారి ప్రాథమిక పాఠశాలలో అంగన్ వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఎంఈఓ-2 రమా రజనీ, ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్, సీఆర్పీ పాల్గొన్నారు.

దుర్గంధం నుంచి ప్రజలను కాపాడాలి


సమావేశంలో పాల్గొన్న సీపీఎం కార్యదర్శి అరుణ్ తదితరులు

ప్రకాశం నగర్: కంబాల చెరువులో చేపలు చనిపోయి నాలుగు రోజులుగా దుర్గంధం వస్తుంటే, వాటిపై మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వహించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ అన్నారు. శ్యామల సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగర ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులలో రూ.9.2 కోట్లు వెచ్చించి కంబాల చెరువును అభివృద్ధి పరిచారన్నారు. ఆ పార్కును సక్రమంగా నిర్వహించకపోవడాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉండాల్సిన పార్కుకు, నిర్వహణ కోసం ప్రవేశ రుసుం వసూలు చేస్తున్నారన్నారు. అయినా సక్రమంగా నిర్వహించకపోవడం అధికారుల బాధ్యతా రహిత్యమని ఆరోపించారు. ఈ సమస్యను చెప్పడానికి మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసినా స్పందన లేదన్నారు. సమావేశంలో నగర కార్యదర్శి బి.పవన్, నాయకులు మూర్తి, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ల జోరు

- వసతులు, బోధనపై అధ్యాపకుల ఇంటింటి ప్రచారం
- అడ్మిషన్ల కోసం క్యూ కడుతున్న విద్యార్థులు


రంగంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

రంగంపేట: ఇటీవల పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేర్పించాలంటూ అధ్యాపకులు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. మండలంలోని ప్రభుత్వ కళాశాలలో అత్యుత్తమ బోధన, ఉచిత సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయంటూ అధ్యాపకులు చేస్తున్న విస్తృత ప్రచారం సత్ఫలితాలను ఇస్తోంది. ఫలితంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అడ్మిషన్లు వెల్లువెత్తుతున్నాయి. అధ్యాపకులు సమీప గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులు, ఆధునిక వసతులతో కూడిన తరగతి గదులు, లైబ్రెరీ, ల్యాబ్ తదితర సౌకర్యాలు ఉన్నాయని వివరిస్తున్నారు.

మండలంలోని పలు వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు, గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకుని ఓసారి ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి నిర్ణయం తీసుకోవాల్సిందిగా కోరుతున్నారు. మండల కేంద్రమైన రంగంపేటలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మే నెల నుంచే అడ్మిషన్లు ప్రారంభించారు. పదో తరగతి పాసైన విద్యార్థులు తమ మార్క్స్ మెమో, ఆధార్, ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకొచ్చి అడ్మిషన్లు పొందుతున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటివరకూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి 100 మందికి అడ్మిషన్లు పూర్తి చేశారు. మొదటి సంవత్సరం నుంచి ద్వితీయ సంవత్సరానికి ప్రమోట్ అయిన 147 మంది విద్యార్థులు ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్నారు.

కార్పొరేట్ స్థాయి వసతులు



"మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యుత్తమ బోధనతో పాటు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తున్నాం. ప్యూరిఫైడ్ మంచినీటి సదుపాయం, విశాలమైన తరగతి గదులు, విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, విశాలమైన ల్యాబరేటరీలు అందుబాటులో ఉన్నాయి. నిష్ణాతులైన 11 మంది అధ్యాపకులు, ఆధునిక వసతులతో కూడిన తరగతి గదులు, విశాలమైన క్రీడా స్థలం ఉన్నాయి."

– బి.హేమ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రంగంపేట

తాగునీటి వృథాకు చెక్


పైపులైన్‌కు వేసిన కొత్త వాల్వ్

సాక్షి ఇంపాక్ట్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వెంకటగిరి కొండపై గోదావరి సురక్షిత మంచి నీటి పథకం పైపులైన్ వాల్వ్ పాడవడంతో 'వృథాగా పోతున్న తాగునీరు' శీర్షికన 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. దానికి అధికారులు స్పందించారు. బొమ్మూరు పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శనివారం పాడైపోయిన వాల్వ్‌ను తొలగించి కొత్తది వేశారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ


కడియంలో కొత్తూరి రత్నం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న స్టాలిన్, బాబు తదితరులు

కడియం: మండలంలోని కడియం, కడియపులంక గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం పరామర్శించారు. మండల అధ్యక్షులు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, నాయకులు గిరజాల బాబు, అడపా సుబ్రహ్మణ్యం, చిక్కాల ఉమామహేశ్వర రావు, గారపాటి వీర్రాజు, మర్రి చంద్రరావు, సత్యనారాయణ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు. కడియంలో కొత్తూరి రత్నం కుటుంబ సభ్యులను, కడియపులంకలో పుల్లా మాణిక్యం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అక్కాచెల్లెళ్లకు రూ.50 వేల ఆర్థిక సాయం

కంబాలచెరువు: తల్లిదండ్రులను కోల్పోయిన అక్కాచెల్లెళ్లకు దాసరి ప్రియాంక చారిటబుల్ ట్రస్ట్ రూ.50 వేల ఆర్థిక సాయం అందజేసింది. స్థానిక సుంకర భాస్కర రావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న మిరియాల తేజస్వి, 5వ తరగతి చదువుతున్న మిరియాల కరుణ సత్య అక్కాచెల్లెళ్లు. వీరి చిన్నతనంలోనే తండ్రి మరణించాడు. ఇళ్లల్లో పని చేసుకుంటూ వీరిని పెంచిన తల్లి తీవ్ర అనారోగ్యంతో గతేడాది చనిపోయింది. అప్పటి నుండి వీరిద్దరినీ అమ్మమ్మ పెంచుతోంది. ఈ నేపథ్యంలో ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న దాసరి శివసత్యమూర్తి తాను నడుపుతున్న దాసరి ప్రియాంక చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆ విద్యార్థులకు రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారు. ఆ మొత్తాన్ని ప్రధానోపాధ్యాయుడు ఆర్.సన్యాసిరావు చేతుల మీదుగా అందజేశారు. ఆ డబ్బును పిల్లలిద్దరి పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయనున్నారు.


ఆరోపణలు మానుకోవాలి

సీతానగరం: టీడీపీ నాయకులు చేస్తున్న నిరాధార ఆరోపణలు మానుకోవాలని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి హితవు పలికారు. వారు శనివారం మాట్లాడుతూ పురుషోత్తపట్నం పంచాయతీలో అవినీతి జరిగిందని టీడీపీ నాయకులు మూడు రోజులుగా ఆరోపిస్తున్నారన్నారు. అవినీతి జరిగిందని ఆరోపించడం సరికాదని, ఆధారాలు ఉంటే నిరూపించాలన్నారు. దానిపై ఎక్కడికైనా చర్చకు సిద్ధమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

మధురపూడి: చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెంలోని సీతారామపురంలో యువతిపై హత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ప్రగతి శీల మహిళా సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కోరుకొండలో ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వాలు మారినా మహిళలకు రక్షణ కరువవుతోందన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నష్ట పరిహారంగా రూ.30 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సినిమాలు



శ్యామల	ఓఎంజీ (ఓ మంచి ఘోస్ట్)
సూర్యమినీ	నింద
సూర్యప్యాలెస్	హరోంహర
స్వామి	మహారాజ
శివజ్యోతి	ఏ
అనుశ్రీ	మనమే
రాజా	బ్యాడ్‌బాయ్స్
ఊర్వశి	అంతిమతీర్పు
రంభ	కేజీఎఫ్-1
మేనక	ప్రేమకథా చిత్రమ్
అప్సర	ప్రభుత్వ జూనియర్ కళాశాల
కుమారి	హనీమూన్ ఎక్స్‌ప్రెస్
నామవరం	
వీఎస్ మహల్	మహారాజ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	మహారాజ